## ఉస్మానియా వర్సిటీని ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో
# అభివృద్ధి చేస్తా

మొదటిపేజీ తరువాయి

ప్రారంభించాలని కోరారని తెలిపారు. ఉస్మానియా వర్సిటీ అనే పదం తెలంగాణకు ప్రత్యామ్నాయ పదమని అన్నారు. నిజాం నవాబును పొగుడుతూ పాడటం కాదు.. దేశ స్వాతంత్ర్యం కోసం ఓయూ గడ్డపై నిలబడి వందేమాతరం పాడిన పీవీ నరసింహా రావు నేడు తనకు గుర్తొస్తున్నారని తెలిపారు. సాయుధ పోరాటంలో భాగంగా మారుమూల పల్లెల్లో ఎర్రజెండా పట్టుకుని పోరాటం చేసిన ఎందరో మహాభావులు ఉస్మానియా యూనివర్సిటీ అండగా నిలబడిందని అన్నారు. జాతీయ స్థాయిలో హోంమంత్రిగా పనిచేసిన శివరాజ్ పాటిల్‌తో మొదలు పెడితే.. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన పీవీ నరసింహా రావు లాంటి మహనీయులు చదివిన వర్సిటీ.. ఉస్మానియా వర్సిటీ అని కొనియాడారు.

**ఉస్మానియాను కాలగర్భంలో కలపాలని చూశారు..**

తెలంగాణ తొలితరం మర్రి చెన్నారెడ్డి, మల్లికార్జున్ గౌడ్, మదన్మోహన్ లాంటి వాళ్లు కూడా ఓయూ విద్యార్థులేనని అన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఘనత సాధించిన మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్ రెడ్డి కూడా ఓయూ బిడ్డేనని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉస్మానియా యూనివర్సిటీ పాత్ర చరిత్ర మరువదని అన్నారు. నేటికీ తెలంగాణలో ఏ సమస్య వచ్చినా.. ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా యూనివర్సిటీయేనని పేర్కొన్నారు. చదువుతో పాటు పోరాటాన్ని నేర్పింది వర్సిటీయేనని.. తెలంగాణ సాధన యాదయ్య, శ్రీకాంతా చారి, వేణుగోపాల్ రెడ్డి కోసం అమరుదయ్యాడని గుర్తు చేశారు. అలాంటి చైతన్యాన్ని రగిల్చిన ఉస్మానియాను కొందరు కాలగర్భంలో కలిపాలని చూశారని ఆరోపించారు. 108 ఏళ్ల యూనివర్సిటీకి ఓ దళితుడిని వీసీగా చేసి చూపించామని అన్నారు. ఇక్కడే చదువుకున్న వారికి విద్యారంగంలో కీలక పదవులు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**డ్రగ్స్, గంజాయి కల్చర్ వేగంగా విస్తరిస్తోంది..**

నేడు దేశానికి యువ నాయకత్వం అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమస్యల చర్చే కాదు.. సైద్ధాంతిక అంశాలకు కూడా వేదిక కావాలన్నారు. సామాజిక, సాంకేతిక అంశాలపై డిస్కషన్ జరగాలని అన్నారు. మనలో అసహనం పెరిగిందని, అశాంతి ఎక్కువైందని కామెంట్ చేశారు. చర్చించే వారిపై అణిచివేత ఎక్కువ కాలం నిలబడదని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో పరిణామాలు మానసిక వేదనకు గురిచేస్తున్నాయని తెలిపారు. కాలేజీల్లో కూడా విద్యార్థులు గంజాయికి అలవాటు పడుతున్నారని అన్నారు. డ్రగ్స్, గంజాయి కల్చర్ వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో చైతన్యవంతమైన చర్యలు లేకపోవడం వల్లే అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. పేదలకు పంచేందుకు భూములు లేవని.. పేదల తలరాతలను మార్చేందుకు ప్రభుత్వం ఇవ్వగలిగింది నాణ్యమైన విద్య అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**ఓయూకు మళ్లీ వస్తా..**
**ఈసారి ఒక్క పోలీస్ ఉండొద్దు**

తాను కూడా పేదరికం నుంచి ఈ స్థాయికి వచ్చానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులు వారిని నష్టం చేసిన వాళ్లను నిర్ద్వందంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మన బడ్జెట్ రూ.లక్ష కోట్లు కాళేశ్వరం రూపంలో గంగలో కలిశాయని అన్నారు. కానీ, తమ ప్రభుత్వం రూ.25 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా స్కూళ్లను నిర్మిస్తోందని తెలిపారు. తాను మళ్లీ ఉస్మానియా యూనివర్సిటీ తప్పకుండా వస్తానని.. డిసెంబర్‌లో ఆర్ట్స్ కాలేజీ ముందు మీటింగ్ పెడతానని అన్నారు. క్యాంపస్ పరిధిలో ఒక్క పోలీస్ కూడా ఉండొద్దని.. ఎవరి అభిప్రాయం వాళ్లు చెప్పొచ్చని అన్నారు. అప్పుడు విద్యార్థులు నినసన తెలిపినా తాను ఏమీ అనబోనని తెలిపారు. విద్యార్థులు లేవనెత్తిన సమస్యలపై అదేరోజు అక్కడికక్కడే ఓయూ అభివృద్ధి పనులకు జీవోలు ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

**మరో 15 రోజుల్లో ఎమ్మెల్సీగా కోదండరాంను పంపుతాం**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో ఏనుగులు సింహాలు ఉన్నాయంటూ ఏఐ టెక్నాలజీతో వీడియో క్రియేట్ చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కానీ ఏనుగులు, మానవ మృగాలు ఫామ్‌హౌస్‌లో ఉన్నాయని.. ముందు వాటిని బంధించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ పదవిపై ఢిల్లీ వరకు వెళ్లి కుట్రలు చేశారని.. మరో 15 రోజుల్లోగా ఎమ్మెల్సీగా కోదండరామ్‌ను పంపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఓయూకు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేస్తానని.. ఇంజినీర్స్ కమిటీ వేయాలంటూ యోగితారాణాను సీఎం ఆదేశించారు.




## రేవంత్ రెడ్డితో విభేదాలు
# ఉన్న మాట నిజమే..

- 25 మంది ఎమ్మెల్యేలతో రాజగోపాల్ రెడ్డి సీక్రెట్ మీటింగ్ అంటూ ప్రచారం
- ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పిన కోమటిరెడ్డి
- పార్టీలో చీలిక తెచ్చే ఉద్దేశం లేదని వ్యాఖ్య

**హైదరాబాద్ ఆగస్టు 25 (ప్రజాస్వరం):**

తాను 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రహస్యంగా సమావేశమయ్యానంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ వార్తలను ఆయన పూర్తిగా ఖండించారు. కొంతమంది ఎమ్మెల్యేలు తనను మామూలుగానే కలిశారని, దానిని ఒక సమావేశంగా చిత్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన వివరణ ఇచ్చారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు కొన్ని విషయాల్లో అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ, పార్టీలో చీలిక తీసుకువచ్చే ఆలోచన తనకు లేదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీకి నష్టం కలిగించే పనులు తాను చేయబోనని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డి పనితీరుపై రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే కొన్ని విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన రహస్య భేటీ నిర్వహించారనే వార్తలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపాయి.

మరోవైపు, బీజేపీ నేత ఈటల రాజేందర్‌తో కలిసి రాజగోపాల్ రెడ్డి కొత్త పార్టీ పెట్టబోతున్నారనే ఊహాగానాలు కూడా మీడియాలో బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యేలతో సమావేశం వార్త బయటకు రావడంతో ఆ ఊహాగానాలకు మరింత బలం చేకూరినట్టయింది. అయితే, రాజగోపాల్ రెడ్డి స్వయంగా ఈ ప్రచారాన్ని కొట్టిపారేయడంతో ప్రస్తుతానికి ఈ చర్చకు తెరపడినట్లయింది. అయినప్పటికీ, అధికార పార్టీలో ఒక సీనియర్ ఎమ్మెల్యేపై ఇలాంటి వార్తలు రావడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది.



# ప్రధాని జైలుకెళ్లినా.. రాజీనామా చేయాల్సిందే

- ప్రధాని, సీఎంలు 30 రోజులు జైల్లో ఉంటే పదవి కోల్పోతారని వెల్లడి
- ఈ నిబంధన మోదీకి కూడా వర్తిస్తుందని స్పష్టీకరణ
- జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడం ప్రజాస్వామ్యానికి అవమానమన్న హోంమంత్రి
- ఇది రాజకీయ కుట్రేనంటూ ప్రతిపక్షాల తీవ్ర నిరసన

**నేషనల్‌బ్యూరో ఆగస్టు 25 (ప్రజాస్వరం):**

జైలుకు వెళ్లిన మంత్రుల పదవుల తొలగింపునకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై వస్తున్న విమర్శలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా గట్టిగా తిప్పికొట్టారు. ఈ బిల్లు ప్రకారం, ప్రధాని నరేంద్ర మోదీ జైలుకు వెళ్లినా తన పదవిని కోల్పోవాల్సి ఉంటుందని, ఆయన తనకు తాను ఈ నిబంధనను వర్తింపజేసుకున్నారని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో పస లేదని ఆయన కొట్టిపారేశారు.

గతవారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. వీటిలో ఒకటైన రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, 2025 ప్రకారం.. కనీసం ఐదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉన్న కేసులో ప్రధాని, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్టయి 30 రోజుల పాటు కస్టడీలో ఉంటే, 31వ రోజున వారు ఆటోమేటిక్‌గా తమ పదవులను కోల్పోతారు. అయితే, ఇది బీజేపీయేతర ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్ర అని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడిన అమిత్ షా, ప్రతిపక్షాల తీరుపై మండిపడ్డారు. "ఒక ముఖ్యమంత్రి గానీ, ప్రధాని గానీ జైలు నుంచి దేశాన్ని పాలించడం సాధ్యమేనా? ఇది మన ప్రజాస్వామ్య గౌరవానికి తగినదేనా? జైలునే సీఎం హౌస్, పీఎం హౌస్‌గా మార్చేసి.. అక్కడి నుంచే డీజీపీ, చీఫ్ సెక్రటరీలకు ఆదేశాలిస్తారా? ఒక వ్యక్తి లేకపోతే దేశ పాలన ఆగిపోతుందన్న వాదనను నా పార్టీ, నేను పూర్తిగా తిరస్కరిస్తున్నాం" అని ఆయన అన్నారు.

గతంలో ఇందిరా గాంధీ తన పదవిని కాపాడుకోవడానికి 39వ రాజ్యాంగ సవరణ తెచ్చారని, కానీ ప్రధాని మోదీ మాత్రం తనకు కూడా వర్తించేలా చట్టం తీసుకొచ్చారని అమిత్ షా గుర్తుచేశారు.



ఈ బిల్లు వల్ల పార్లమెంటులో గానీ, అసెంబ్లీలో గానీ ఎవరి మెజారిటీకి నష్టం వాటిల్లదని స్పష్టం చేశారు.

"ఒక సభ్యుడు జైలుకు వెళ్తే, పార్టీకి చెందిన మరో సభ్యుడు ప్రభుత్వాన్ని నడుపుతారు. బెయిల్ వచ్చాక మళ్లీ ప్రమాణ స్వీకారం చేయొచ్చు. దీనికి అభ్యంతరం ఎందుకు?" అని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనీయకుండా ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించడం సరికాదని, దీనిపై ఉభయ సభల సంయుక్త కమిటీలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.



## కేసీఆర్ ను కడియం శ్రీహరి బ్లాక్ మెయిల్ చేశారు

- కూతురి ఎంపీ చేయడం కోసమే కడియం పార్టీ మారారని రాజయ్య ఆరోపణ
- కడియం ఒక అవినీతి తిమింగలమంటూ ఘాటు వ్యాఖ్యలు
- విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు పోస్టులు అమ్ముకున్నారని విమర్శ
- విదేశాల్లో ఆస్తులు, బినామీ లావాదేవీలు ఉన్నాయని ఆరోపణలు
- స్పీకర్ వెంటనే కడియం అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్ ఆగస్టు 25 (ప్రజాస్వరం):**

ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఒక అవినీతి తిమింగలమని, ఆయన ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పలేని అయోమయ స్థితిలో ఉన్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య ఎద్దేవా చేశారు. కేవలం తన కుమార్తెకు ఎంపీ టికెట్ ఇప్పించుకోవడం కోసమే శ్రీహరి పార్టీ మారారని, తన రాజకీయ సమాధిని తానే నిర్మించుకున్నారని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో చేరానని స్వయంగా ప్రకటించిన కడియం శ్రీహరి, ఇప్పుడు అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. "పదిహేనేళ్ల పాటు మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు గుర్తుకురాని అభివృద్ధి, ఇప్పుడు కొత్తగా గుర్తుకువచ్చిందా?" అని రాజయ్య నిలదీశారు. స్టేషన్ ఘన్‌పూర్‌ను అభివృద్ధి చేయడం పక్కనపెట్టి, కడియం శ్రీహరి మాత్రమే అభివృద్ధి చెందారని ఆరోపించారు.

శ్రీహరి విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగాలను అమ్ముకున్నారని, కాంట్రాక్టర్ల నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేశారని విమర్శించారు. అంతేకాకుండా, విదేశాల్లో ఆస్తులు కూడబెట్టారని, హైడల్ ప్రాజెక్టులను అమ్ముకున్నారని, బినామీ పేర్లతో ఆయనకు భారీగా ఆస్తులున్నాయని ఆరోపించారు. టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారుతానంటూ కేసీఆర్‌ను సైతం కడియం బ్లాక్‌మెయిల్ చేశారని రాజయ్య వ్యాఖ్యానించారు.

ఫిరాయింపుల విషయంలో స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని రాజయ్య డిమాండ్ చేశారు. "జస్టిస్ బీఆర్ గవాయ్ మూడు నెలల గడువు ఇచ్చారు. స్పీకర్ రాజ్యాంగాన్ని గౌరవించి, అంబేద్కర్ మీద గౌరవం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు వింటే స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లే అవుతుంది" అని హెచ్చరించారు. కడియం శ్రీహరికి ప్రజలు కచ్చితంగా కర్రుకాల్చి వాత పెడతారని రాజయ్య జోస్యం చెప్పారు.



## అనంతగిరి రిసార్ట్స్‌కి కొత్త రూపు..
### మంత్రి జూపల్లి ప్రత్యేక ప్లాన్ ఏంటి.?

- అనంతగిరి హరిత రిసార్ట్స్ ను పైలట్ ప్రాజెక్ట్‌గా కలెక్టర్‌కి బాధ్యత
- ప్రైవేట్ రిసార్ట్స్ కు ఏమాత్రం తీసిపోని ఆధునిక సౌకర్యాలు
- ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఆదాయ వనరులు పెరుగుదలపై నమ్మకం
- అనంతగిరి పర్వత సౌందర్యం పర్యాటకులను ఆకర్షిస్తుందన్న మంత్రి విశ్వాసం

**హైదరాబాద్ ఆగస్టు 25 (ప్రజాస్వరం):**

వికారాబాద్ జిల్లా అనంతగిరి పర్యాటక అభివృద్ధి దిశగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పలు చర్యలు చేపట్టారు. వికారాబాద్ కేంద్రంలో ఆయన అనంతగిరి హరిత రిసార్ట్స్, అనంతగిరి వ్యూ టవర్ ప్రాంతాలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హరిత రిసార్ట్స్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పర్యవేక్షణలో అప్పగించినట్లు తెలిపారు. ప్రైవేట్ రిసార్ట్స్ అందించే సౌకర్యాలకు ఏమాత్రం తీసిపోకుండా ఆధునిక సదుపాయాలతో హరిత రిసార్ట్స్‌ను అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టు ద్వారా వికారాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి, ప్రభుత్వానికి ఆదాయ వనరులు విస్తరించి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయని మంత్రి నమ్మకం వ్యక్తం చేశారు. కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకుని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వికారాబాద్ పర్యాటక దృష్టిలో ప్రత్యేకత కలిగిన ప్రదేశమని, అనంతగిరి పర్వతాల అందాలు, హరిత రిసార్ట్స్ సదుపాయాలు, వ్యూ టవర్ ఆకర్షణలు మరింత మంది సందర్శకులను ఆకట్టుకుంటాయని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## స్వదేశీ ఉద్యమానికి యువతే నాయకత్వం వహించాలి

- అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ బాలికల హాస్టల్‌కు వీడియో సందేశం ద్వారా శంకుస్థాపన
- స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలకు, యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 'ఇక్కడ స్వదేశీ వస్తువులే అమ్ముతాం' అని బోర్డులు పెట్టాలని దుకాణదారులకు సూచన
- మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రధాని మోదీ
- నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడి

**అహ్మదాబాద్ ఆగస్టు 25 (ప్రజాస్వరం):**



దేశ స్వావలంబనకు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడమే కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇది వందేళ్ల నాటి పాత నినాదం కాదని, దేశ భవిష్యత్తును బలోపేతం చేసే ఆధునిక ప్రచారమని ఆయన స్పష్టం చేశారు. ఈ నూతన స్వదేశీ ఉద్యమానికి సమాజం, ముఖ్యంగా యువత నాయకత్వం వహించాలని ఆయన పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ ఫేజ్ 2 కన్యా ఛాత్రాలయ (బాలికల వసతి గృహం) శంకుస్థాపన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదివారం ఆయన వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, ప్రతి దుకాణదారుడు తమ వద్ద 'కేవలం స్వదేశీ ఉత్పత్తులు మాత్రమే అమ్ముతాం" అనే బోర్డును ప్రదర్శించాలని సూచించారు. కుటుంబాలు కూడా దేశీయంగా తయారైన వస్తువులనే కొనుగోలు చేయాలని కోరారు. మంచి ఉద్దేశంతో పవిత్రమైన లక్ష్యంతో సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తే దైవబలం కూడా తోడవుతుందని ఆయన పేర్కొన్నారు.

మహిళా సాధికారత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని నొక్కిచెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న ఈ హాస్టల్‌లో 3,000 మంది బాలికలకు వసతి కల్పించనున్నామని, ఇది వారిని ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా చేస్తుందని తెలిపారు. వడోదర, సూరత్, రాజ్‌కోట్, మెహసానా వంటి నగరాల్లోనూ ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు బాలికా విద్య కోసం ప్రారంభించిన 'కన్యా శిక్షా రథ యాత్ర' వంటి కార్యక్రమాలు ఇప్పుడు 'బేటీ బచావో, బేటీ పఢావో' రూపంలో దేశవ్యాప్త ఉద్యమంగా మారాయని గుర్తు చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక అవకాశాలు కల్పించేందుకు 'లఖ్‌పతి దీదీలు', 'డ్రోన్ దీదీ', 'బ్యాంక్ సఖి' వంటి పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని మోదీ తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా భారత నైపుణ్య మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోందని అన్నారు.

సౌరశక్తి, రక్షణ, డ్రోన్ పరిశ్రమలతో పాటు స్టార్టప్‌ల రంగంలో దేశం రికార్డు స్థాయిలో పురోగమిస్తోందని చెప్పారు. ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతోనే ఈ నెలలో రూ.1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ దొంగ ఓట్లతో గెలిచాడు..
# బీఆర్ఎస్ మూడు ముక్కలైంది

- తెలంగాణలోని 8 మంది బీజేపీ ఎంపీలపైనా అనుమానం ఉందన్న మహేశ్ గౌడ్
- దొంగ ఓట్లతోనే మోదీ అధికారంలోకి వచ్చారంటూ విమర్శ
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు ఖాయమని ధీమా

**హైదరాబాద్ ఆగస్టు 25 (ప్రజాస్వరం):**

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. కరీంనగర్‌లో బండి సంజయ్ విజయం దొంగ ఓట్లతోనే సాధ్యమైందని, తెలంగాణలోని మిగతా బీజేపీ ఎంపీల గెలుపుపైనా తమకు అనుమానాలున్నాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. కరీంనగర్ జిల్లాలో చేపట్టిన జనహిత యాత్రలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ, "కరీంనగర్‌లో బండి సంజయ్ గెలుపు దొంగ ఓట్ల వల్లే జరిగింది. రాష్ట్రంలోని మిగతా 8 మంది బీజేపీ ఎంపీలు కూడా ఇలాగే గెలిచారేమోనని అనుమానంగా ఉంది" అని అన్నారు. బీసీల సమస్యలను పక్కనపెట్టి బండి సంజయ్ ఢిల్లీకి పరిమితమయ్యారని, రాష్ట్ర సమస్యలపై స్పందించడం లేదని విమర్శించారు. ప్రధాని మోదీ సైతం ప్రజల మద్దతుతో కాకుండా దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చారని ఆయన ఆరోపించారు.

ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీపైనా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ ఇప్పటికే మూడు ముక్కలైందని, త్వరలోనే నాలుగో ముక్క కూడా బయటకు వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణలో ఇక కాంగ్రెస్ పార్టీకి తప్ప మరే పార్టీకి భవిష్యత్తు లేదని, వచ్చే ఎన్నికల్లో వందకు తగ్గకుండా సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని, వారి భవిష్యత్తుకు భరోసా ఇచ్చేందుకే ఈ జనహిత యాత్ర చేపట్టామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేయలేకపోయిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే ఇళ్లను సిద్ధం చేసి చూపిస్తోందని తెలిపారు. కులం, మతం పేరుతో ఓట్లు అడగటం బీజేపీకి అలవాటు అని, కాంగ్రెస్ పార్టీ మాత్రం అభివృద్ధి, సంక్షేమ అజెండాతోనే ప్రజల ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు.





# విద్యార్థిపై లాఠీ పడితే.. తెలంగాణ సమాజం ఊరుకోదు

- పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు
- ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల అరెస్ట్ అప్రజాస్వామికం
- అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్



**హైదరాబాద్ ఆగస్టు 25 (ప్రజాస్వరం):** సీఎం రేవంత్ ఉస్మానియా యూనివర్సిటీ పర్యటన నేపథ్యంలో విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై నిషేధాజ్ఞలు విధిస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నదని చెప్పారు కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా రేవంత్ రెడ్డి చేసిందేముందన్నారు. జాబ్‌క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని మండిపడ్డారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వస్తున్న సందర్భంగా విద్యార్థులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక, పిరికిపంద చర్య. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక్క విద్యార్థి మీద పోలీసు లాఠీ పడినా తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరిస్తున్నాం. ఇందుకేనా విద్యాశాఖను, హోం శాఖను మీ వద్ద పెట్టుకున్నది. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నది. మొత్తం తెలంగాణ సమాజం మీద నిషేధాజ్ఞలు విధిస్తారా?. ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పాలన అని చెప్పి, ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెచ్చిండు రేవంత్ రెడ్డి. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇవ్వడం, కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా నువ్వు చేసింది ఏముంది రేవంత్ రెడ్డి?. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేసారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేసారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేసారు. 22నెలల్లో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నావు. నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నవు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవు. గ్రంథాలయాల్లో పోలీసు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఇనుప కంచెలు, బ్యారికెడ్లతో ప్రజా తిరుగుబాటును ఆపలేరు. పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఉస్మానియా విద్యార్థి, నిరుద్యోగులు సింహాలై గర్జిస్తరు. ఉద్యోగాల పేరిట మీరు చేసిన మోసాన్ని ఎక్కడిక్కడ నిలదీస్తరు. మోసం చేసినందుకు ఉస్మానియా సాక్షిగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.' అని హరీశ్ రావు అన్నారు.



# పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన ముత్యాల సునీల్ కుమార్

**భీంగల్,ఆగష్టు 25(ప్రజాస్వరం):** భీంగల్ మండలంలోని ముచ్కూర్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. గ్రామానికి చెందిన రాకేష్ న్యూమోనియా వ్యాధితో బాధపడుతూ చనిపోయారన్న విషయం తెలుసుకొని సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగిందని తెలిపారు. అలాగే గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బురెడ్డి సంతోష్ అనారోగ్యంతో బాధపడుతుంటే పరామర్శించి క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జర్నలిస్టుల వినాయక చవితి వేడుకలు

- 600 మందికి మట్టి వినాయక విగ్రహం, వ్రతకల్పం, పూల, పండ్ల మొక్కలు పంపిణీ
- అక్రిడేషన్ లపై దశలవారీగా వినతి పత్రాలు
- జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి గంట్ల

**ఆసీల్ మెట్ట,ఆగష్టు 25(ప్రజాస్వరం):** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ , ఏపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ల ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేయనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ విశాఖ అధ్యక్షులు పి.నారాయణలు తెలిపారు. ఈ మేరకు సోమవారం వేమన మందిరంలో సంఘాల సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు..ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వినాయక చవితి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. నిరంతరం సమాజాభివృద్ధి కోసం పాటు పడుతున్న జర్నలిస్టుల సంక్షేమంతో పాటు ఆయా పండుగలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇందులో భాగంగానే మంగళవారం ఆశీలమెట్ట వేమన మందిరంలో ఉదయం 10 గంటల నుంచి 600 మంది జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహం ,వినాయక వ్రతకల్పం,పూల,పండ్ల మొక్కలను అందజేయనున్నట్లు చెప్పారు. కావున జర్నలిస్టులు ఆయా కార్యక్రమంలో పాల్గొని మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించాలని వీరు కోరారు..అలాగే అక్రిడేషన్లు కూడా అర్హులైన వారందరికి అందజేసే విధంగా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు దశలవారీగా వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు.ఈ సమావేశంలో ఫెడరేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కె.మధన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బి..శివ ప్రసాద్ నాయుడు, సత్య నారాయణ ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సభ్యులు మళ్ళ దేవ త్రినాధ్,డిపి నాయుడు,కె బాబురావు, అప్పలనాయుడు స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డీ చక్రపాణి,పీ వెంకట రెడ్డి,కోశాధికారి కే వీ శర్మ,సంయుక్త కార్యదర్శులు బీ ప్రసాద్,రాజశేఖర్,కార్యవర్గసభ్యుడు అరుణ్ భాస్కర్,రెడ్డి సాయి తో పాటు పలువురు జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.



# ఫీజుల పెంపా?కుదింపా?

మొదటిపేజీ తరువాయి

కమిటీని వే సింది. ఈ కమిటీ సూచనల మేరకు కాలేజీల ఫీజుల వ్యవహారాన్ని మరోసారి ఎఫ్ఆర్సీ విచారిస్తోంది.

**ప్రైవేటు కాలేజీలకు టెన్షన్**

కాలేజీల్లో నాణ్యత ప్రమాణాలను కొత్తగా మార్గదర్శకాలుగా తీసుకుంటున్నారు. ఇందుకు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు ఉన్న కాలేజీలను గుర్తించాల్సి ఉంటుంది. దీనిపై కాలేజీ యాజమాన్యాల్లో గుబులు మొదలైంది. కొన్ని కాలేజీలకు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు ఉన్నా గతంలో ఎప్పుడూ ఫీజుల పెంపునకు వీటిని కొలమానంగా తీసుకోలేదు. ఈ ర్యాంకులు లేకున్నా, తక్కువ స్థాయిలో ఉన్నా నిర్ణీత ఫీజుకు కత్తెర కూడా వేసే అవకాశం ఉందని యాజమాన్యాలు భయపడుతున్నాయి. కొన్ని కాలేజీలు న్యాక్ ర్యాంకు కోసం కూడా ప్రయత్నించలేదు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు టాప్ కాలేజీలకు మాత్రమే వస్తున్నాయని యాజమాన్యాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో పెద్ద కాలేజీలకే న్యాయం జరుగుతుందని, చిన్న కాలేజీలు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

**ఆడిట్ లెక్కలపై సందేహాలు**

గత మూడేళ్ల జమా ఖర్చులను కాలేజీలు ఎఫ్ఆర్సీకి ఇప్పటికే సమర్పించాయి. వీటిని ఆడిట్ విభాగాలు పరిశీలించాయి. అయితే, కాలేజీల్లో ఆడిట్ చేసినవారితో ఎఫ్ఆర్సీ ఆడిటర్లకు సంబంధాలున్నాయని, ఇప్పుడు వారిని మార్చే అవకాశం ఉందని చెబుతున్నారు. మౌలిక వసతులకు చేసిన ఖర్చు, ఫ్యాకల్టీకి చెల్లించిన వేతనాలు డిజిటల్ విధానంలో చూపించా లని ఎఫ్ఆర్సీ కోరే అవకాశం ఉంది.


అయితే దాదా పు 85 కాలేజీల వద్ద ఇలాంటి ఆధారాలు లేవని సమాచారం. దీంతో ఈ కాలేజీల ఫీజుల్లో కోత పడుతుందా? అనే సందేహాలు యాజమాన్యాల్లో కలుగుతున్నాయి. ప్లేస్‌మెంట్లను కూడా ఫీజుల పెంపునకు కొల మానంగా తీసుకోబోతున్నారని తెలిసింది.

అయితే, కొన్నేళ్లుగా కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడం లేదు. ఆఫ్ క్యాంపస్ నియామకాలే జరుగుతున్నాయి. పెద్ద కాలేజీల్లో విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాలకు ప్రయత్నించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని ఎంతవరకు పరిగణనలోనికి తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

**భవిష్యత్ కార్యాచరణపై కాలేజీల కసరత్తు**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్సీ ముందు హాజరైనా.. భవిష్యత్ కార్యాచరణపై ఉమ్మడిగా ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు భావిస్తున్నాయి. షెడ్యూల్ ప్ర కారం మొదటి వారం రోజులు ఎఫ్ఆర్సీ ముందు హాజరయ్యే వాటిల్లో ఒక మోస్తరు కాలేజీలున్నాయి.

వీటి పట్ల కమిటీ ఎలా వ్యవహరిస్తుంది? ఏయే అంశాలను పరిగణనలోనికి తీసుకుంటుంది? ఫీజులు పెంచుతారా? తగ్గిస్తారా? అనే అంశాలను పరిశీలించాలని నిర్ణయించాయి. దీని ఆధారంగా వచ్చేవారం సమావేశమై చర్చించాలని నిర్ణయించినట్టు ఓ కాలేజీ ప్రతినిధి తెలిపారు. అవసరమైతే న్యాయ పోరాటం చేయడమా? ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమా? ఏదీ కాకపోతే సమ్మెకు వెళ్లడమా? అనే అంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.






# రేషన్ డీలర్లకు కమిషన్ ను వెంటనే చెల్లించాలి.

- వనపర్తి జిల్లా రేషన్ డీలర్ల సంఘం డిమాండ్.
- తహసిల్దార్ కు వినతి పత్రం

**వనపర్తి,ఆగష్టు 25 (ప్రజాస్వరం):** గత ఐదు నెలలుగా రేషన్ డీలర్ల కు కు ప్రభుత్వం కమిషన్ చెల్లించ లేదని వెంటనే చెల్లించాలని వనపర్తి జిల్లా రేషన్ డీలర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం వనపర్తి తాహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాహసిల్దార్ కు అందించారు. తమకు వేరే వృత్తి లేదని ఇదే వృత్తిపై జీవనం సాగిస్తున్నామని, చాలీచాలని ఆదాయంతో కుటుంబాలను పోషించలేని స్థితిలో ఉన్నామన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, మా యొక్క కమిషన్ మాత్రం గత చాలా సంవత్సరాల నుండి పెరగడం లేదన్నారు.ప్రతి నెల షాప్ కిరాయి,కరెంటు బిల్లు, హమాలీ చార్జీలు,హెల్పర్ వేతనం చెల్లించడంతో తమకేమీ మిగలడం లేదని వారు వాపోయారు.రేషన్ షాపులలో బియ్యం మాత్రమే ఇస్తుండడంతో కొద్దిగా కమిషన్ వస్తుందని దీని వల్ల మేము ఆర్థికంగా చాలా నష్టపోతున్నామని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం 30,000 ఇవ్వాలని,లేదా క్వింటాల్కు 300 కమిషన్ ఇచ్చి 9 రకాల వస్తువులను సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ అకాల మరణం సంభవిస్తే ముప్పై వెలు దహన సంస్కారాలకు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ 10 లక్షల రూపాయలు అందించి డీలర్ కుటుంబాల ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు బచ్చు రాము ,వనపర్తి మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు వెంకట్ రెడ్డి,ప్రవీణ్,నరేష్,రాఘవేంద్ర, నరసింహా రెడ్డి,సత్యారెడ్డి డీలర్లు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు బిజెపి శ్రేణులు సిద్ధం

**బిజెపి నాయకులు సబిరెడ్డి వెంకటరెడ్డి,వెంకటేశ్వర్ రెడ్డి, పెద్దిరాజు**

**వనపర్తి,ఆగష్టు 25 (ప్రజాస్వరం):** స్థానిక సంస్థల ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సిద్ధంగా ఉందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబి రెడ్డి వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, వనపర్తి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు అన్నారు.

సోమవారం వనపర్తి మండలం చందాపూర్ గ్రామంలో రాబోయే స్థానిక ఎన్నికలకు బిజెపి శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడంలో భాగంగా గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించారు.


ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నా కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రిజర్వేషన్ల పేరిట ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తున్నారన్నారు. అమలుకు సాధ్యం కానీ 6 గ్యారంటీ హామీలు అమలు చేస్తామని ఎన్నికల్లో గెలిచారని గద్దెనెక్కాక అమలులో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందారని తీవ్రంగా విమర్శించారు.

ఉపాధ్యక్షులు రామన్న వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించి ఎన్నికలకు వెళ్లాల్సిందేనని కమిటీల పేరుతో కాలయాపన చేసి మోసం చేస్తే బీసీ సమాజం కాంగ్రెస్ పార్టీనీ తిరస్కరించడం ఖాయమన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడంతో రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వ నిధులు ఆగిపోయి గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయని గ్రామాల్లో పారిశుద్ధ కార్మికులకు జీతాలు ట్రాక్టర్లకు ఈఎంఐలు డీజీలు కు నిధులు లేక కార్యదర్శులు సతమతమవుతున్నారని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన గడువులోగా నోటిఫికేషన్ వస్తే బిజెపి శ్రేణుల అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉన్నాయని అందులో భాగంగానే చందాపూర్ గ్రామంలో వార్డు సభ్యులు సర్పంచి ఎంపీటీసీ పోటీకీ ఒక్కొక్క స్థానానికి రిజర్వేషన్ ప్రకారం స్త్రీలు పురుషులు కలిపి ఐదుగురు పేర్లు తీసుకోవడం జరిగిందని గ్రామ పార్టీ నాయకులు మోడీ గారి సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరిస్తూ అన్ని సామాజిక వర్గ వర్గాల నాయకులను సమన్వయం చేసుకొని వార్డు సభ్యులు సర్పంచ్ లేదా ఎంపీటీసీ గెలిచే వరకు గ్రామాలు విడిచి బయటకు వెళ్ళొద్దని సూచించారు.

సమావేశంలో మండల అధ్యక్షులు సంద వెంకటేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పోలేమోని బాలరాజు, ప్రధాన కార్యదర్శి చిన్న నరసింహ, కార్యదర్శి సంపత్,గ్రామ నాయకులు రాఘవేందర్, రాజశేఖర్,రామకృష్ణ,హరినాథ్ రెడ్డి,ఎల్ల స్వామి,బూత్ అధ్యక్షులు డాకేష్,సతీష్,నారాయణ తదితరులు పాల్గొన్నారు.





# నేటి యువత చదువుతోపాటు సామాజిక స్పృహ,సేవ కలిగి ఉండాలి.

**సురవరం ప్రతాపరెడ్డి గ్రంధావిష్కరణ సభలో డాక్టర్ జి చిన్నారెడ్డి.**

**వనపర్తి,ఆగష్టు 25 (ప్రజాస్వరం):** యువత చదువుతోపాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి అన్నారు.సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో జరిగిన ఆంధ్ర విద్యాలయ విద్యాసంస్థల వ్యవస్థాపక కార్యదర్శి ,కాలం కన్నా ముందు నడిచిన మేధావి సురవరం ప్రతాప్ రెడ్డి గ్రంథ ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి పాలమూరు మట్టి పరిమళం వైద్య సేవలో శిఖరాయమానం మనిషినీ గుండె నిండుగా ప్రేమించిన మహోన్నత హృదయ సంపన్నులు వైద్యరత్న కీర్తిశేషులు డాక్టర్ జిల్లెల్ల మాధవరెడ్డికి అంకితం చేశారు.ఈ సందర్భంగా కీర్తిశేషులు డాక్టర్ జిల్లేల మాధవరెడ్డి కుమార్తె డా. జిల్లెల శిల్ప, డాక్టర్ అనురాగ్ రెడ్డిలకు అందజేశారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ జి చిన్నారెడ్డి మాట్లాడుతూ సాహితీ శిఖరం సురవరం ప్రతాపరెడ్డి ఆనాటి కాలంలోనే నిజాం నిరంకుశ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న అణిచివేతలను ఎదిరించిన గొప్ప సాహసి అని సమాజాన్ని మేల్కొల్పిన గొప్ప సంఘసంస్కర్త అన్నారు.కవిగా,చిత్రకారుడుగా, రచయితగా,వ్యాసకర్తగా,పత్రిక సంపాదకుడిగా,పరిశోధకుడిగా ఆయన ప్రజలను చైతన్యపరిచారని అటువంటి గొప్ప వ్యక్తి గ్రంథాన్ని ఆవిష్కరించడం నా పూర్వజన్మ సుకృతమన్నారు. అందులో స్వయానా నా సోదరుడైన కీర్తిశేషులు అయినటువంటి పాలమూరు మట్టిపరిమలం ,వైద్యంలో శిఖరం , సామాన్య కుటుంబంలో జన్మించి వైద్యవృత్తిని చేపట్టి ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రుల వంటి పెద్ద ఆసుపత్రుల్లో పని చేస్తూనే ప్రతి శనివారం హైదరాబాదు నుండి వనపర్తికి ఆర్టీసీ బస్సులో వచ్చి పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించారని అటువంటి డాక్టర్ మాధవరెడ్డికి అంకితం ఇవ్వడం తనకి ఎంతో సంతోషం కలిగించిందన్నారు.ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా తెలంగాణ చరిత్ర అధ్యయన కేంద్రం మానవ వనరుల విభాగం చైర్మన్ కెప్టెన్ పాండురంగారెడ్డి, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, డాక్టర్ జిల్లెల్ల శిల్ప ,డాక్టరు అనురాగ్ రెడ్డి, డాక్టర్ సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి,ఆచార్య సూరారపు భిక్షం, బొజ్జ అమరేందర్ రెడ్డి, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులను డాక్టర్ జి చిన్నారెడ్డి సన్మానించారు. గ్రంథా ఆవిష్కరణ సభలోకాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్,రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి నిరంజన్ బాబా సమావేశాన్ని వచ్చిన అతిథులను ప్రజలను సమన్వయపరిచారు. గ్రంథ ఆవిష్కరణ సభలో పట్టణ ప్రముఖులు,ప్రజలు,విద్యార్థులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

**భీంగల్,ఆగష్టు 25(ప్రజాస్వరం):** భీంగల్ మండలంలోని గోన్ గొప్పుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేశ బోయిన సత్యనారాయణ, కొమ్ము మల్లేష్,కేతవత్ రాజ్ కుమార్, మాలావత్ జగన్ సోమవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర పురోగతిని దృష్టిలో ఉంచుకొని బాల్కొండ నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్ నాయకత్వంలో పని చేయడానికి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు చేరిన వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో భీంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోదిరే స్వామి,మాజీ ఎంపీపీ కన్నె సురేందర్,జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేష్,సీనియర్ నాయకులు పర్స అనంతరావ్,రావుల మోహన్,నల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పురం మహేష్ జన్మదిన వేడుకలు

**మనోహరబాద్ (ప్రజాస్వరం) :**
ప్రజా సేవకుడు పురం మహేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు మండ లంలో ఘనంగా జరిగాయి. జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం కాలకంటి బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు ను కలిసి జన్మ దిన వేడుకలపై చర్చించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు పురం మహేష్ కు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ , సిద్దిపేట, మేడ్చల్ జిల్లాల నుంచి అభిమానులు , ఆయా రాజకీయ పార్టీల శ్రేణులు భారీగా తరలి వచ్చి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో మెదక్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ రామ్ మోహన్ గౌడ్ తో పాటు ఆయా మండలాల అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.









## పార్లమెంటులో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




**వికారాబాద్, (ప్రజా స్వరం) :**
ఈ ఏడాది అక్టోబర్ లో బార్బడోస్ దేశంలో జరిగే 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ ( గురించి లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్ల లతో పార్లమెంట్ లో జరిగిన సన్నాహక సమావేశంలో తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఓం బిర్లా ను కలిసి శాలువతో సత్కరించారు. కాగా 1925 లో భారతదేశ సెంట్రల్ లేజిస్లేటివ్ అసెంబ్లీకి స్పీకర్ గా ఎన్నికైన మొదటి భారతీయుడు కీ.శే విఠల్ బాయి పటేల్ సంస్మరణ సందర్భంగా ఢిల్లీ అసెంబ్లీలో జరుగుతున్న రెండు రోజుల ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్ లో భాగంగా సోమ వారం గడ్డం ప్రసాద్ కుమార్ ప్రసంగించారు.



## పరిగి శ్రీ చైతన్య ప్రైవేట్ పాఠశాలను సీజ్ చేయాలి

### సీపీఎం జిల్లా నాయకుల డిమాండ్

**పరిగి, ఆగస్టు 24(ప్రజా స్వరం):**
పరిగి పట్టణంలోని శ్రీ చైతన్య ప్రైవేటు పాఠశాల 9వ తరగతిని నిర్వహించడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకున్న నిబంధ నలకు వ్యతిరేకంగా 9వ తరగతిని నిర్వహిస్తూ, విద్యార్థుల నుండి ఫీజు 4050 వేల రూపాయలు అధిక ఫీజులు వసూలు చేస్తున్న శ్రీ చైతన్య పాఠ శాలను వెంటనే సీజ్ చేయాలని సోమ వారం సిపిఎం, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పరిగి మండల విద్యాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు ఎం.వెంకటయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సి.అనిల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.సత్తయ్య మాట్లాడుతూ పరిగి పట్టణంలోని శ్రీ చైతన్య ప్రవేట్ పాఠశాల పరిగి పట్టణంలో 20242025 సంవత్సరాల నుండి ప్రైమరీ నుండి 8వ తరగతి వరకు మాత్రమే అనుమతులు పొందింది. కాని ఈ సంత్సరం మాత్రం ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు పొందకుండా 9వ




తరగతిని కూడా యాజమాన్యం నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగిస్తుంది. ఈ విషయం పై గత నెలలో విద్యార్థి, ప్రజా సంఘాలు డిఇఓ కు పిర్యాదు చేశారు.. ఆ ఫిర్యాదు కు స్పందించిన జిల్లా విద్యాధికారి వెంటనే శ్రీ చైతన్య పాఠశాలను సందర్శించి అనుమతి లేని తొమ్మిదవ తరగతిని సీజ్ చేయాలని 2025జులై 10 న పరిగి మండల విద్యాధికారికి ప్రొసీడింగ్ ఆర్డర్ ఇవ్వడం జరిగింది. సీజ్ చేయాలని ప్రొసీడింగ్స్ ఆర్డర్ ఉన్న పరిగి మండల విద్యాధికారి ఎందుకు సీజ్ చేయడం లేదని మతాలబ్ ఏమిటని ప్రశ్నించారు. కేవలం పాఠశాలకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారా..? ఇంకేమైనా చేశారా అని మండిపడ్డారు. పరిగి ఎంఈఓ నిర్లక్ష్యంపై పూర్తి స్థాయి విచారణ జరిపి అతనిపై కూడా చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా వేంటనే శ్రీ చైతన్య పాఠశాలలో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న 9వ తరగతిని సీజ్ చేసి, అధిక ఫిజులు వసూలు చేస్తున్న పాఠశాల పై చట్టపరమైన చర్యలు తీసుకోని ,శ్రీ చైతన్య పాఠశాలలో ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల ను వేరే పాఠశాలకు మార్చి వారి ఖర్చులు అన్ని శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం భరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటం తప్పదని ప్రభుత్వన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్ రెడ్డి,రఘురాం, సత్యయ్య, లాలప్ప,రాంచంద్రయ్య, శివ,చింటూ, నవీన్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి లో 130 ఫిర్యాదులు

**వికారాబాద్, ఆగస్టు 24(ప్రజా స్వరం):**
ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనిజిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 130 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్,సుధీర్ ట్రైనీ కలెక్టర్ హార్స్ చౌదరి, డి ఆర్ ఓ మంగ్లీ లాల్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచ కుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటాం



**వికారాబాద్, ఆగస్టు 24(ప్రజా స్వరం) :**
వికారాబాద్ మున్సిపల్ పరిధిలోనీ ఫంక్షన్ హాల్ లో వికారాబాద్ జిల్లా టి ఎస్ ఆర్ టి సి విశ్రాంత ఉద్యోగుల సమావేశం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, వికారాబాద్ జిల్లా ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు అర్ధ. సుధాకర్ రెడ్డి ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటామని వారి సమస్యలు తెలంగాణ శాసనసభ సభాపతి వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం. ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు,సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల కమిషన్ విడుదల చేయాలి

### డీలర్ల సంఘం అధ్యక్షులు తట్టేపల్లి అంజయ్య

**తాండూరు, ఆగస్టు 24(ప్రజా స్వరం) :**
రేషన్ డీలర్లు నెల నెల పంపిణీ చేసే బియ్యం పై ఇవ్వాల్సిన కమిషన్ 5 నెలల బిల్లులు వెంటనే చెల్లించాలని తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు తట్టేపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. సోమవారం పెద్దేముల్ మండల తహశీల్దార్ కార్యాలయం ముందు మండల రేషన్ డీలర్లు సంఘం ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల కమిషన్లు వెంటనే విడుదల చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో కమిషన్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కమిషన్ కాకుండా నెలకు రూ.30వేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని, రేషన్ డీలర్లు దశబ్ద కాలానికి పైగా పోరాడుతున్నామన్నారు. కేరళ, తమిళనాడు



రాష్ట్రంలో గౌరవ వేతనం ఇస్తున్నందున తెలంగాణ లోనూ గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు ఐదు నెలల కమిషన్ రానందున అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 17200 మంది రేషన్ డీలర్లు ఉన్నామని తెలిపారు. జూన్, జూలై, ఆగస్టు నెలలో మూడు నెలల బియ్యం ప్రజలకు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉదయం 7 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం గత ఐదు నెలలుగా రేషన్ డీలర్లకు కమిషన్ విడుదల చేయకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆర్థికంగా అప్పుల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్ల కమిషన్ ఒకేసారి విడుదల చేసి డీలర్ల ఖాతాలో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రేషన్ డీలర్ల కమిషన్ విడుదల చేయాలంటూ తహశీల్దార్ వెంకటేష్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాచ్చయ్య, కార్యదర్శి ఆనంద్ కుమార్, వివిధ గ్రామాల డీలర్లు నర్సింలు, శ్రీనివాస్, చందు, ఎండి అషం, ముస్తఫా, ప్రవీణ్, రామదాస్, భీమ్లా, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బైబిల్ హౌస్ ప్రారంభించిన రూబెన్ మార్క్



**మెదక్ ఆగస్టు 25 (ప్రజా స్వరం) :**
మెదక్ సిఎస్ఐ చర్చ్ మహాదేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన బైబిల్ హౌస్ ను సోమవారం మోడరేటర్, మెదక్ ఇంచార్జీ బిషప్ రేవా ప్రొఫెసర్. డా. రూబెన్ మార్క్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ విన్సన్ట్, సినార్డ్ ట్రెజరర్ విమల్ సుకుమార్, మినిస్టీరియల్ సెక్రటరీ జయానంద్, లే సెక్రెటరీ ప్రభు కిరణ్ కుమార్, ప్రాపర్టీ సెక్రటరీ మంత్రి సాల్మన్ రాజ్, ప్రెస్ బీటర్ ఇంచార్జీ శాంతయ్య, గంట సంపత్, జీఎస్పీ ప్యానెల్ మెంబెర్స్ పాల్గొన్నారు.

# మద్యం తయారీ, విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

**పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**

**వికారాబాద్ జిల్లాలో డిస్టిలరీని తనిఖీ చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు**








**వికారాబాద్, ఆగస్టు 24(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కంకల్ గ్రామంలో బృందావనం స్పిరిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డిస్టిలరీస్ ని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమ వారం తనిఖీ చేశారు. హోల్డింగ్ ట్యాంక్స్, బ్లెండింగ్ యూనిట్, బాటిల్ ఫిల్లింగ్, సీసీ కెమెరాలు లు కమాండ్ కంట్రోల్ సెంటర్ తో అనుసంధానం, ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టం ను క్షుణ్ణంగా పరిశీలించారు. మద్యం తయారీ, ఉత్పత్తి, సరఫరా, లేబ్లింగ్, మద్యం తయారీకి చెందిన ముడి సరుకు, ఇతర సాంకేతికపరమైన తదితర అంశాలపై పూర్తి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.మద్యం తయారీ, విక్రయాల్లో ప్రభుత్వ నియమావళిని కచ్చితంగా పాటించాలని, పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కంపెనీ యాజమాన్యానికి ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా మద్యం తయ్యారీ చేస్తున్నరా లేదా అనే విషయాలు ఆరా తీసేందుకే కంపెనీలో ఆకస్మిక తనిఖీలు చేశామని రికార్డులు కూడా పరిశీలించామని అన్నారు. డిస్టిలరీలు, బేవరేజ్ లో లిక్కర్ తయారీకి ముడి సరుకు దగ్గర నుంచి బాటిల్ బయట వచ్చే వరకు ఆబ్కారీ శాఖ అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది? మద్యాన్ని భర్తీ చేసే క్రమంలో లేబ్లింగ్ ఎలా చేస్తున్నారు? ముడి సరుకు, ఉత్పత్తి అవుతున్న మద్యం, అక్కడ నుంచి డిపోలకు సరఫరా అవుతున్న లిక్కర్ రికార్డులను పరిశీలించినట్లు వెల్లడించారు . ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, అసిస్టెంట్ కమీషనర్ డి శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**నిజమైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి**

**బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత**



**మెదక్ ఆగస్టు 25 (ప్రజా స్వరం) :**

ప్రమాదవశాత్తు మెదక్ మండలం మాచవరం గ్రామంలోని లక్ష్మయ్య, కుమార్ పురి గుడిసె కాలిపోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు వల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇంట్లో ఉన్న వస్తువులతో అన్ని కాలి బూడిదయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండో విడతలు ఇందిరమ్మ ఇండ్లు వస్తుందని, 12 గుంటల పొలాన్ని కూడా అమ్ముకొని ఆ డబ్బులు కూడా గుడిసె లోనే కాలిపోవడం జరిగిందనీ బాధితులు వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ బాధిత కుటుంబానికి నిత్యవసర వస్తువుల కోసం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూడాలని, ఇలాంటి నిజమైన నిరుపేదలను గుర్తించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు కాకుండా అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ మండల బిజెపి అధ్యక్షురాలు బెండ వీణ, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గౌడ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయికుమార్, బూత్ అధ్యక్షులు మంగలి గోపాల్, సత్యనారాయణ, మండల నాయకులు రాకేష్, రవి, సిద్దు అజయ్, వినయ్, రవి, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్‌ను ప్రభుత్వం వెంటనే అరికట్టాలి

**తాండూరు, ఆగస్టు 24(ప్రజా స్వరం) :**

తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలంలో ప్రజా సమస్యల పట్ల ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ కుమార్ మండిపడ్డారు. సోమవారం పెద్దేముల్ తహశీల్దార్ కార్యాలయం ముందు మండల బిజెపి పార్టీ అధ్యక్షులు వీరేశం ఆధ్వర్యంలో మండల ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని బిజెపి పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ కుమార్ మాట్లాడుతూ... మండలంలోని వివిధ గ్రామాల నుండి మండల కేంద్రానికి వస్తున్న ప్రజలకు రహదారులు సరిగా లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమం తర్వాత కెసిఆర్ ఈ ప్రాంతాన్ని నేనే అభివృద్ధి చేస్తానని అబద్ధాలు చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగిపోవాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రిని అడ్డుకొని సమస్యలు విన్నపిస్తే మాపై కేసులు పెట్టి అక్రమంగా నిర్బంధించిన తీరును ప్రజలు గమనిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తే మా బతుకులు బాగుపడతాయని తాండూర్ నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ వెంకటేష్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సందీప్ కుమార్, జిల్లా ఎస్సి మోర్చా ఉపాధ్యక్షులు భూమా నరసింహ, మండల ప్రధాన కార్యదర్శిలు శివరాజ్, వెంకట్రాంరెడ్డి, జిల్లా నాయకులు హరీష్ గౌడ్, యాదయ్య గౌడ్, రామచంద్రి, మండల నాయకులు రాజు, అనంతి, రాథోడ్, పరిపూర్ణ, రవి, కృష్ణ, మైపాల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




# గణేష్ నిమజ్జనం సమయానుకూలంగా ఘనంగా నిర్వహించాలి



**వికారాబాద్, ఆగస్టు 24(ప్రజా స్వరం) :**

గణేష్ నిమజ్జనం వేడుకలను ఈ ఏడాదైనా సమయానుకూలంగా ఘనంగా నిర్వహించాలని వికారాబాద్ హిందు ఉత్సవ కమిటీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కోకట్ మాధవరెడ్డి అధ్యక్షతన వికారాబాద్ శ్రీరామ మందిరంలో ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వికారాబాద్ పట్టణంలో వినాయక నిమజ్జనానికి పూర్వ వైభవం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం రెండు గంటల లోపే న్యూగంజ్ కు చేరుకోని శోభ యాత్రలో పాల్గొనాలని కోరారు. శోభయాత్రలో నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు అనేక గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. అలాంటి వారిని అలరించడానికి మీమీ వినాయకులను కనీసం మధ్యాహ్నం 3 గంటల లోపైన రోడ్లపైకి వచ్చేలా చూసుకోవాలని కోరారు. నిర్వాహకులు గణేష్ ఉత్సవ కమిటీ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు. వినాయక విగ్రహాలను ప్రతిష్టిస్తున్న మండపాల నిర్వాహకులు అందరూ ఈనెల 31న వికారాబాద్ శ్రీరామ మందిరంలో నిర్వహించే హిందూ ఉత్సవ కమిటీ సమావేశానికి హాజరు కావాలని తెలిపారు. ఈ సమావేశంలో హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కోకట్ మాధవరెడ్డి, హిందూ ఉత్సవ కమిటీ కన్వీనర్ కృష్ణ పంతులు, గౌరవ అధ్యక్షులు చిగుళ్లపల్లి రమేష్ కుమార్, విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షులు ప్రశాంత్, ఉత్సవ కమిటీ సభ్యులు కేపీ రాజు, గిరిధర్ రెడ్డి, టి.రాజు, విద్యాసాగర్, శ్రీకాంత్, ఎల్కంటి సత్యనారాయణ, సాయి కృష్ణ, పోకల సతీష్, మల్లికార్జున గౌడ్, హుండేకారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి




**తాండూరు రూరల్ సీఐ నాగేష్**

**తాండూరు, ప్రజాస్వరం :**

వినాయక ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే నవరాత్రి వేడుకలు శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా శాంతియుతంగా జరుపుకోవాలని తాండూరు రూరల్ సిఐ నాగేష్ ఉత్సవ కమిటీలను కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో స్థానిక ఎస్సై వేణు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి ఉత్సవాలు, ముస్లిం కమిటీ సమావేశంలో తాండూర్ రూరల్ సిఐ నాగేష్, తహశీల్దార్ వెంకటేష్ ప్రసాద్, ఎంపీడీవో రతన్ సింగ్ మాట్లాడారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి, ప్రభుత్వం విధించిన నియమాలను పాటించి, ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. గణపతి మండపాల వద్ద ఇద్దరు కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఉండాలని, అవాంఛనీయ సంఘటనలను నివారించడానికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఊరేగింపు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. మండపాల వద్ద ఒక సౌండ్ బాక్స్ మాత్రం పెట్టుకోవచ్చని, డీజే పెట్టుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగించ వద్దన్నారు. మంట పాల కోసం నిర్వాహకులు పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తట్టేపల్లి సొసైటీ వర్క్ చైర్మన్ అంజయ్య,మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్, నారాయణ గౌడ్,మాజీ ఎంపిటిసి శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్ సభ్యులు నజీర్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండాల ప్రవీణ్ కుమార్ గుప్తా, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు వీరేశం, వివిధ గ్రామాల ప్రజాపతినిధులు, వినాయక ఉష కమిటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా అర్హులకే పెన్షన్

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, ఆగస్టు 24(ప్రజా స్వరం:**

జిల్లాలో ఉండే పెన్షన్ దారులకు ముఖ చిత్రం ద్వారా పెన్షన్ అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం వికారాబాద్ జిల్లా సమీ కృత కార్యాలయాల సముదాయం లో సోమ వారం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు మొబైల్ ఫోన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో మొత్తం 194 మంది బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లను ఎంపిక చేయడం జరిగిందని, విరందరికి మొబైల్ ఫోన్ లు అందించడం జరుగుతుందన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు అందించే ఆసరా పెన్షన్ లకు సంబంధించి మొబైల్ ఫోన్ సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్ తో పెన్షన్ దారుల యొక్క ముఖ చిత్రాన్ని ఫోటో ద్వారా పెన్షన్ అందించేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హార్స్ చౌదరి, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, అడిషనల్ డి ఆర్ డి ఓ సెర్ప్ నర్సిములు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# పదేళ్లలో లేని యూరియా కొరత ఇప్పుడెందుకు?

**వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**



**వికారాబాద్, ఆగస్టు 24 (ప్రజాస్వరం):**

వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం క్యూ లైన్‌లలో ఇబ్బంది పడుతున్న రైతులను. వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కలిసి వారి సమస్యలు ఆరా తీశారు. మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతను తీర్చేలా ప్రభుత్వానికి మేలుకొలుపు అయ్యేలా చూడాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. గత పదేళ్ళ కెసిఆర్ పాలనలో ప్రతీ సీజన్ లో అధికారులతో సమీక్షలు చేస్తూ విత్తనాలు, ఎరువులు, కరెంట్ మరియు ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసారు. ఏనాడు లేని యూరియా కొరత ఇప్పుడు ఎట్లా వచ్చింది..? అని అన్నారు. రైతులు తమ పొలం పనులను సైతం పక్కనపెట్టి యూరియా కోసం రోడ్ ఎక్కుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని వాపోయారు. యూరియా లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే, యూరియా కొరత లేదని అధికారులు తప్పుడు ప్రకటనలు చేస్తూ రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. యూరియా కొరతే లేకుంటే పీఏసీఎస్‌ల వద్ద చెప్పుల లైన్ లు ఎందుకు..? అని అన్నారు. రైతులు యూరియా కోసం పడుతున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా ఈ ప్రభుత్వం వెంటనే ఎరువుల కొరత తీర్చేలా చర్యలు తీసుకోవాలి అని అన్నారు.


# స్థానిక సమస్యలతో ప్రజల ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని పాలకులు

**మాటూరి బాలరాజు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు**

**వలిగొండ,ఆగస్ట్ 25 (ప్రజాస్వరం):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం స్థానికంగా గ్రామాల్లో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్న పట్టించుకునే నాదులే లేకుండా కరువయ్యారని వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు డిమాండ్ చేశారు

సోమవారం రోజున సిపిఎం ఆధ్వర్యంలో మండల పరిధిలోని పులిగిల్ల వర్కట్పల్లి గ్రామాల్లో గ్రామ పంచాయతీల ముందు నిర్వహించిన ధర్నా సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు మండల కార్యదర్శి సిర్పంగి స్వామిలు మాట్లాడుతూ గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు లేక స్పెషల్ ఆఫీసర్లు పంచాయతీ కార్యదర్శులు నిధుల లేమితో సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల గ్రామాల్లో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

పులిగిల్ల నుండి కేర్చిపల్లి వరకు అధ్వానంగా మారిన బీటీ రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని అనేక సందర్భాల్లో ఆందోళన నిర్వహించిన అధికారులు,ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు .పులిగిల్లలో పల్లె దవాఖాన నూతన భవనాన్ని నిర్మించాలనిగ్రామాల్లో కోతుల,కుక్కల బెడదను నివారించాలని డిమాండ్ చేశారు. వర్కట్పల్లి నుండి పొద్దుటూరుకు వెళ్లే మట్టి రోడ్డుపై పెద్ద ఎత్తున గుంతలు పడి ప్రజలు రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్.



ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి, పులిగిల్ల శాఖ కార్యదర్శి బుగ్గ చంద్రమౌళి, వర్కట్పల్లి శాఖ కార్యదర్శి గూడూరు బుచ్చిరెడ్డి,సహాయ కార్యదర్శివేముల నాగరాజు, నాయకులు దొడ్డి బిక్షపతి,మెట్టు రవీందర్ రెడ్డి,చేగురి నర్సింహ,వేముల అమరేందర్, మాదుగుల వెంకటేశం,వేముల చంద్రయ్య,వడ్డెమాని రవి,వనం యాదయ్య, బొడ్డు రాములు,వరికుప్పల నరసింహ,బుగ్గ కిష్టయ్య,గోగు కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



## రైతుల యూరియా కోసం బి ఆర్ఎస్ పార్టీ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**ఆత్మకూరు,ఆగష్టు 25(ప్రజాస్వరం):** నేడు ఆత్మకూరు మండలంలో అతిథి గృహంలో బి.ఆర్.యెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి రైతులు పడ్తున్న అవస్థ చూసి యూరియా లేక తల్లడిలుతున్న రైతుల పక్షాన నిర్వహించి ప్రభుత్వాని ప్రశ్నిస్తే.. దాన్ని తప్పు పట్టిన కాంగ్రెస్ నాయకులకు కౌంటర్ నేడు నిర్వహించి రైతుల కోసం అనుక్షణం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడీ ప్రశ్నిస్తూనే ఉంటారు, రైతులకు అన్యాయం జరిగితే కచ్చితంగా రైతుల పక్షాన చిట్టెం రామ్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఉద్యమిస్తాం అని ప్రగల్భాలు పలకడం కాదు సరైన సమయంలో రైతులకు కావాల్సిన యూరియా అందించి చూపించాలి కాని ఏది పడితే అది మాట్లాడడం సబబు కాదు అని, అవసరాన్ని బట్టి పార్టీలు మరెవరూ కూడా నేడు చిట్టెం రామ్మోహన్ రెడ్డి గురించి మాట్లాడడం వారి విజ్ఞత కు నిదర్శనం అని ఇప్పటికైనా మేల్కొని రైతులకు యూరియా అందించే విధంగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలి, లేదా కచ్చితంగా రైతుల పక్షాన ఎల్లప్పుడూ అండగా చిట్టెం రామన్న నాయకత్వం లో బి.ఆర్.యెస్ పార్టీ అండగా ఉంటుంది అని తెలియచేసారు.. అనంతరం పి.ఏ.సి.యెస్ కార్యాలయంలో రైతులకు టొకన్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుంటే బి.ఆర్.యెస్ పార్టీ నాయకులు అందరూ అక్కడికి వెళ్ళి రైతుల పక్షాన ప్రశ్నించి వెంటనే రైతులకు యూరియా టోకెన్లు ఇప్పించడం జరిగింది





## పీఎం శ్రీ పాఠశాల కేంద్ర ప్రభుత్వం నిధులతో

- డీకే అరుణమ్మ కంప్యూటర్ అలాగే లైబరీ రూమ్ మంజూరు చేశారు
- 35 లక్షల రూపాయలు శాంక్షన్ చేపించారు


**మక్తల్ ప్రతినిధి ఆగస్టు,,25,( ప్రజాస్వరం )** ఈరోజు ఆత్మకూరు పట్టణంలోని 8 వ వార్డు లోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం పక్కన ఉన్న పీఎం శ్రీ పాఠశాలకు కేంద్ర ప్రభుత్వం నిధులతో పాలమూరు ఎంపీ శ్రీమతి డికె అరుణమ్మ 35 లక్షల రూపాయల నిధులతో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ రూమ్. మంజూరు చేయటం జరిగింది వాటిని నిర్మించడానికి స్కూల్ ఆవరణలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి స్థల పరిశీలన చేయడం జరిగింది ఆత్మకూరు మండల ఎం ఇ ఓ. మరియు స్కూల్ హెడ్ మాస్టర్ వారితో సాధ్యమైనంత తొందరలో ఈ నిర్మాణాన్ని పూర్తి చేయాలని మన స్కూలుకు ఎంపీ నిధులతో మంజూరైన కంప్యూటర్ రూమ్, లైబ్రరీ రూమ్. సాధ్యమైనంత తొందరగా నిర్మించాలని చెప్పారు ఇట్టి కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు అశోక్ భూపాల్ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్ గౌడ్ , మాజీ మండల అధ్యక్షులు తమ్మలి విజయ్ విష్ణువర్ధన్ రెడ్డి మరియు మండ్ల సూరి జిల్లా నాయకులు కే ఆనంద్ , తదితరులు పాల్గొనడం జరిగింది



## కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్నిప్రమాదం

**సుమారు 20 నుంచి 30 లక్షల వరకు ఆస్తి నష్టం**

**కాప్రా, ఆగష్టు 25 (ప్రజాస్వరం):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయి కృష్ణ నగర్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాత్రి సుమారు 9 గంటల 40 నిమిషాల ప్రాంతంలో డయల్ 100కు కాల్ రావడంతో ఈ విషయం బయటపడింది. సమాచారం అందుకున్న వెంటనే కుషాయిగూడ ఇన్స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్లతో చేరుకుని స్థానికుల సహకారంతో మంటలను అదుపులోకి తెచ్చారు. దాదాపు ఆరు గంటలపాటు శ్రమించి మంటలను పూర్తిగా ఆర్పివేయగలిగారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. తదుపరి విచారణలో అగ్ని ప్రమాదానికి గురైన స్క్రాప్ గోడౌన్ కీ.శే. కొంతం అంజయ్య (S/o రామయ్య, జమ్మిగడ్డ వాసి) కు చెందినదని తెలిసింది. అంజయ్య కుమారుడు కె. ప్రవీణ్ ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## పెద్దమందడికి బీటీ డబల్ రోడ్డు పనులు ఏమయ్యాయి.?



- ముఖ్యమంత్రి పర్యటనలో 40 కోట్లు మంజూరైనట్లు శిలాఫలకాలు.
- ఏడాది గడిచినా ఉలుకు పలుకు లేదంటూ బిజెపి నాయకుల విమర్శ.



**పెద్దమందడి,ఆగష్టు 25(ప్రజాస్వరం):** పెద్దమందడి మండల కేంద్రం నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి బీటీ డబల్ రోడ్డు పనులు ఏమయ్యాయని బిజెపి నాయకులు ప్రశ్నించారు. 1000 కోట్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన సమయంలో పెద్దమందడికి 40 కోట్లతో చేపట్టేందుకు శంకుస్థాపన చేసి ఏడాది గడుస్తున్నా నేటికీ ఉలుకు పలుకు లేదని వారు విమర్శించారు. సోమవారం బిజెపి మండల అధ్యక్షులు ముప్పూరి చెన్నయ్య ఆధ్వర్యంలో స్థానిక సమస్యలు పరిష్కరించాలని బస్టాండు నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ తహసిల్దార్ కు మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మేఘారెడ్డి సొంత మండలం అయిన పెద్దమందడికి బీటి డబల్ రోడ్డు పనులు చేయించుకోలేని అసమర్థుడిగా మిగిలిపోయారని విమర్శించారు. మండల ఇన్చార్జి శ్రీశైలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుకు సాధ్యం కానీ హామీలతో గద్దెనిక్కి నేడు పాలనలో అన్ని రంగాలలో వైఫల్యం చెందారని విమర్శించారు. శంకర సముద్రం రిజర్వాయర్ నుండి మోటార్ల ద్వారా నీళ్లు రావడంలేదని మోటార్లు రిపేరు చేసి వెల్టూరు చెరువు నింపాలని కోరారు. ఎమ్మెల్యే మెగా రెడ్డి గతంలో గుత్తేదారుగా పనిచేసిన బుద్ధారం నుండి పెద్దమందడి బ్రాంచ్ కెనాల్ పనులు లైనింగ్ సమస్య నిర్వహణ నిర్లక్ష్యం వల్ల ఎక్కడికక్కడ కెనాల్ తెగిపోతుందని వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్ ఉపాధ్యక్షులు శివారెడ్డి కావలి తిరుపతయ్య మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధా తదితరులు పాల్గొన్నారు.



## అధునాతన సూపర్ స్పెషాలిటీ సేవలతో ఏ ఎస్ రావు నగర్‌లో మెడికోవర్ క్లినిక్‌ల ప్రారంభోత్సవం

**ఎమ్మెల్యే బండారి**

**ఏ ఎస్ రావు నగర్,ఆగష్టు 25(ప్రజాస్వరం):** హైదరాబాద్, ఉప్పల్ నియోజకవర్గంలోని ఏ ఎస్ రావు నగర్‌లో మెడికోవర్ హాస్పిటల్స్ కొత్త క్లినిక్‌లను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.కార్డియాలజీ, న్యూరాలజీ, పల్మనాలజీ, గైనకాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ విభాగాలతో ఈ క్లినిక్ ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించనుంది. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, "ప్రాంతీయులకు ఇంటి వద్దే అధునాతన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మెడికోవర్ ఈ క్లినిక్‌ను ప్రారంభించడం ప్రశంసనీయం" అన్నారు. కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష మాట్లాడుతూ, "ప్రాంత ప్రజలకు సమయానుకూలంగా చికిత్స అందించేందుకు ఈ క్లినిక్ ఎంతో తోడ్పడుతుంది" అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, "దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఎఎస్ రావు నగర్ ప్రజలకు వైద్య సదుపాయాలు లభిస్తాయి" అన్నారు.మెడికోవర్ హాస్పిటల్స్ బిజినెస్ ఆపరేషన్స్ చీఫ్ మహేష్ దేగ్లూర్కర్ మాట్లాడుతూ, "ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి, రోగులకు అనుకూలంగా తీసుకురావడం మా లక్ష్యం. ఈ క్లినిక్ ప్రారంభం ఆ దిశగా మరో ముందడుగు" అన్నారు. హైదరాబాద్‌లో కమ్యూనిటీ హెల్త్‌కేర్‌ను బలోపేతం చేయాలనే మెడికోవర్ లక్ష్యంలో ఈ కొత్త క్లినిక్ ఒక కీలకమైన భాగంగా నిలుస్తుందని తెలిపారు.

## రేషన్ లబ్ధిదారులకు ఆధునిక స్మార్ట్ కార్డుల పంపిణీ.

**విశాఖ పట్నం, ఆగష్టు 25(ప్రజాస్వరం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆధునిక డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను నగరంలోని 20వ వార్డు పెదవాల్తేరు రేషన్ డిపో నంబర్ 185 వద్ద విశాఖ టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించి క్యూ ఆర్ కోడ్ తో కూడిన ఆధునిక డిజిటల్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తోందన్నారు. దీని వల్ల లబ్ధిదారులకు కలిగే రేషన్ కష్టాలు పూర్తిగా తొలగుతా యన్నారు. ఈ రోజు నగర వ్యాప్తంగా ప్రారంభమైన ఈ పంపిణీ కార్యక్రమం ఈ నెలాఖరుకు పూర్తయి సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులు ఈ క్రొత్త డిజిటల్ కార్డులను వినియోగించి రేషన్ సరుకులు తీసుకో వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రమణ, బీజేపీ నాయకులు అనిల్, టీడీపీ నాయకులు చిన్నపిల్లి ఆనంద్, కాకి శివ, గోపి, చిన్నపిల్లి తారక్, స్థానిక సచివాలయ సిబ్బంది, రేషన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఖిల్లా ఘనపురంలో నేడు సమీకృత కూరగాయల మార్కెట్ ప్రారంభం.

**హాజరై ప్రారంభించనున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి.**



**వనపర్తి ప్రతినిధి,ఆగష్టు 25(ప్రజాస్వరం):** ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సమీకృత కూరగాయల మార్కెట్ ను నేడు ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉదయం 11:30 గంటలకు ప్రారంభించే సమీకృత మార్కెట్ కార్యక్రమానికి డిసిసిబి అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ లు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. అలాగే పెద్దమందడి, ఖిల్లా గణపురం మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## గ్రామాలను పరిశీలించిన ఎంపీడీవో

**వలిగొండ ఎంపీడీవో జి జలంధర్ రెడ్డి**

**వలిగొండ ఆగస్ట్ 25 (ప్రజాస్వరం)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఎంపీడీవో జి జలంధర్ రెడ్డి సుంకిశాల మరియు పులిగిల్ల గ్రామాలను సందర్శించి ఇందిరమ్మ ఇండ్లు. సుంకిశాల అంగన్వాడి కేంద్రాలను ఆశా సిబ్బందితో. పులిగిల్ల పల్లె హాస్పిటల్స్ ను సందర్శించారు .అంగన్వాడి కేంద్రంలో అటెండెన్స్ రిజిస్టర్ లను పరిశీలించారు .సిబ్బందితో మాట్లాడుతూ తగిన తగిన సూచనలు అందించారు గ్రామాల్లో వారికి అందుతున్న వైద్యం హాస్పిటల్స్ సిబ్బందితో చర్చించారు. గ్రామములో శానిటేషన్ వర్క్ ఇతర డెవలప్మెంట్ కు సంబంధించిన విలేజ్ సెక్రెటరీ కి తగిన సహా లు ఇచ్చారు.



## తెలంగాణ అంటేనే త్యాగాలు పోరాటాలు

**సంగిశెట్టి క్రిస్టఫర్ టి యు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**వలిగొండ,ఆగష్టు 25(ప్రజాస్వరం):** తెలంగాణ అంటేనే త్యాగాలు పోరాటాలు అని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘీశెట్టి క్రిస్టఫర్ అన్నారు. ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనేక పోరాటాల తోటి త్యాగాలతోటి జైలు నిర్బంధాలను లెక్కచేయకుండా రబ్బర్ బుల్లెట్లను లెక్కచేయకుండా రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులను నేటి వరకు గుర్తించకపోవడం దారుణమని ఆయన అన్నారు. జార్ఖండ్ తరహాలో ఉద్యమకారులను గుర్తించాలని ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వెంటనే గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలని హామీ లో భాగంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలముతో పాటు 30 వేల రూపాయల పెన్షన్ ఇంటి స్థలాలు హెల్త్ కార్డు ఇచ్చి వెంటనే హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఊదలతో ఉబకాయం దూరం..!

భారతదేశంలో చిరు ధాన్యాలను తరచుగా ఉపయోగిస్తారు. చిరుధాన్యాలలో అనేక పోషకాలు నిండి ఉంటాయి. అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందులో ఊదలు కూడా ఒకటి. పురాతన కాలం నుండి ఊదలు ఆహారంగా, ఔషధంగా ఉపయోగించబడుతున్నాయి. వీటిలో ఫైబర్, ప్రొటీన్లు, కాల్షియం, ఐరన్, ఫాస్పరస్, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. అన్నం, కిచిడీ, దోసె, ఇడ్లీ ఇలా రకరకాలుగా ఊదలతో చేసుకుని తినవచ్చు.. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పౌష్టికాహారం. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఊదలు తినడం చాలా మంచిది. వాటిని నేరుగా తినకుండా పాలు, స్మూతీస్ లేదా స్వీట్లతో కలుపుకోవచ్చు. గుండె జబ్బులు ఉన్నవారు వీటిని పరిమిత పరిమాణంలో తినాలి. ఊదలలో క్యాలరీలు తక్కువగానూ, పీచుపదార్థాలు ఎక్కువగానూ ఉండటం వల్ల కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది ఆకలిని తగ్గిస్తుంది మరియు బరువు నియంత్రణలో సహాయపడుతుంది. ఊదలులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా ఉండాలంటే రోజూ ఊదలు తినడం మంచిది. ఊదలు గ్లూటెన్ రహిత ఆహారం. అందువల్ల, గ్లూటెన్ అలెర్జీ ఉన్నవారు కూడా వాటిని తినవచ్చు. ఊదలలోని విటమిన్ సి, విటమిన్ డి చర్మాన్ని ఆరోగ్యంగా, పోషణతో ఉంచడంలో సహాయపడతాయి. ఇది చర్మాన్ని ముడతలు పడకుండా చేసి చర్మం యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. ఊదలు తినడం వల్ల మూత్రాశయ నియంత్రణకు, పిత్తాశయ రాళ్లను తొలగించడానికే కాకుండా.. కొన్ని రకాల జ్వరాలకు చికిత్స చేయడానికి కూడా సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఊదలు తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతుంది. మధుమేహం ఉన్నవారికి లేదా మధుమేహం వచ్చే ప్రమాదం ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. గర్భిణీ స్త్రీలు పాలకూర తింటే చాలా మేలు జరుగుతుంది. అవి పుట్టబోయే బిడ్డ అభివృద్ధికి అవసరమైన ఇనుమును అందిస్తాయి. ప్రసవ సమయంలో ఉపశమనాన్ని అందించడానికి ఊదలు సహాయపడుతుందని పరిశోధనలు కూడా చెబుతున్నాయి. ఊదలు గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి మరియు గుండె సంబంధిత రుగ్మతల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఊదలలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్‌స్‌ని తొలగించి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అందువలన, అవి శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి.




# ఈ లడ్డూ రోజుకు ఒకటి తింటే చాలు

ప్రస్తుత పరుగుల ప్రపంచంలో పోషకాహార లోపం అతి పెద్ద సమస్యగా మారుతుంది. పని ఒత్తిడి వల్లో, సమయం లేకనో చాలా మంది రెడి టు ఈట్ ఆహారం వైపు, ఫాస్ట్ ఫుడ్ వైపు అడుగులు వేస్తున్నారు. అవి తినడం వల్ల ఆ కాసేపు నోటికి రుచికరంగా, ఆ క్షణానికి తినాలి అన్న పని ముగుస్తుంది. కానీ మనకు ఆరోగ్య పరంగా ఎటువంటి మేలు ఉండదు. పైగా అనారోగ్య కారకాలు అధికమైపోతాయి. ఈ విషయం అందరికీ తెలుసుకు. కానీ పని ఒత్తిడి బాస్.. ఫుడ్ ప్రిపేర్ చేసుకునే సమయం లేకనే ఇలా చేస్తున్నాం. లేకపోతే ఈ ఫుడ్ తినడం మాకు మాత్రం ఇష్టామా ఏంటి అని సమాధానం చెప్తారు. అయితే ఇకపై హెల్తీ ఫుడ్ కోసం వంటగదుల్లో ప్రతి రోజూ యుద్ధాలు చేయాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. పిజ్జాలు, బర్గర్, ఫ్రైడ్ రైస్‌లు వంటి జంక్ తినడం వల్ల ఏర్పడిన పోషకాల లోపాలను రోజుకు ఒక్క లడ్డూ తినడం ద్వారా తగ్గించుకుకోవచ్చంటున్నారు. ఈ లడ్డూ ప్రతి రోజూ ఒకటి తింటే ఎటువంటి పోషకాహార లోపాలు ఉన్నా తగ్గుతాయని, వాటి వల్లు వచ్చేర సమస్యలు కూడా దూరమవుతాయని నిపునులు అంటున్నారు. అవే మల్టీసీడ్స్ లడ్డూలు. మరి వీటి రెసిపీ ఏంటో తెలుసా.. రండి చూసేద్దాం.



## కావలసిన పదార్థాలు

అవిసె గింజలు రెండు స్పూన్లు
గుమ్మడి గింజలు రెండు స్పూన్లు
సన్ ఫ్లవర్ సీడ్స్ రెండు స్పూన్లు
నువ్వులు రెండు స్పూన్లు
ఓట్స్ పావు కప్పు
ఖర్జూరాలు పది
యాలకుల పొడి చిటికెడు
నెయ్యి ఒక స్పూను

## మల్టీ సీడ్స్ లడ్డూ రెసిపీ

1. స్టవ్ మీద కళాయి పెట్టి అవిసె గింజలు, గుమ్మడి గింజలు, పొద్దు తిరుగుడు గింజలు, నువ్వులు, ఓట్స్ వంటివన్నీ కూడా వేయించుకొని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి.
2. స్టవ్ మీద కళాయి పెట్టి ఒక స్పూన్ నెయ్యిని వేయాలి.
3. ఆ నెయ్యిలో ఖర్జూరాలను సన్నగా తరిగి వేయించుకోవాలి.
4. ఆ ఖర్జూరం మిశ్రమంలోనే ముందుగా రుబ్బి పెట్టుకున్న పొడిని కూడా వేసి బాగా కలపాలి.
5. అలాగే యాలకుల పొడిని కూడా వేయాలి.
6. ఈ మొత్తం మిశ్రమాన్ని స్టవ్ ఆఫ్ చేసి మొత్తం మిశ్రమాన్ని చల్లార్చాలి.
7. ఇప్పుడు ఈ మిశ్రమంలో అవసరమైతే కొంచెం నెయ్యిని వేసుకొని లడ్డూల్లా చుట్టుకోవాలి.
8. అంతే టేస్టీ మల్టీ సీడ్స్ లడ్డు రెడీ అయినట్టే.
9. వీటిని సీసాలో ఉంచి మూత పెట్టాలి. ప్రతిరోజూ ఒకటి తింటే చాలు, మీ శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి.

## వీటి వల్ల కలిగే ప్రయోజనాలు

మల్టీ సీడ్స్ లడ్డు రెసిపీలో మనం అవిస గింజలను వాడాము. ఇందులో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచే గుణాలు ఉన్నాయి. అవిసె గింజలను ప్రతిరోజూ ఆహారంలో భాగం చేసుకోమని కూడా చెబుతారు. ఇవి జీర్ణ క్రియను మెరుగుపరుస్తాయి. క్యాన్సర్ తో పోరాడుతాయి. మధుమేహాన్ని నియంత్రిస్తాయి. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి. చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. అలాగే ఖర్జూరాన్ని కూడా ఎక్కువగానే వినియోగించాము. ఈ ఖర్జూరంలో కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్, విటమిన్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి.

ఖర్జూరంలో ఇనుము కంటెంట్ అధికంగా ఉంటుంది. కాబట్టి రక్తహీనత సమస్యతో బాధపడుతున్న వారు ఖర్జురాన్ని ఆహారంలో భాగం చేసుకుంటే ఉత్తమం.



ప్రతిరోజూ రెండు ఖర్జూరాలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు కూడా చెబుతున్నారు. అలాగే గుమ్మడి గింజలు, సన్ ఫ్లవర్ సీడ్స్, నువ్వుల్లో కూడా ఆరోగ్యానికి కావాల్సిన ఎన్నో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవన్నీ కూడా మనకు పోషకాహార లోపం లేకుండా చేస్తాయి. కాబట్టి మల్టీ సీడ్స్ లడ్డును కచ్చితంగా మహిళలు పిల్లలు తినేందుకు ప్రయత్నించాలి.





# అనుష్క హోటల్ ముందు 1500 మంది పడిగాపులు కాసేవాళ్ళు !

అనుష్క షెట్టి క్రేజ్ గురించి ఘాటి నిర్మాత రాజీవ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు!

క్రిష్ దర్శకత్వంలో ఘాటి సినిమా సెప్టెంబర్ 5న గ్రాండ్ రిలీజ్!


ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో షూటింగ్‌లో అనుష్క ఫ్యాన్ ఫాలోయింగ్‌ను చూసి ఆశ్చర్య-పోయిన టీమ్!

అనుష్క క్రేజ్ గురించి ఘాటి సినిమా నిర్మాత రాజీవ్ రెడ్డి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. అనుష్క ప్రధాన పాత్రలో, క్రిష్ దర్శకత్వంలో రూపొందిన ఘాటి సినిమా సెప్టెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఒక పక్క దర్శకుడు తో పాటు, మరోపక్క నిర్మాతలు కూడా గట్టిగానే సినిమాని ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా నిర్మాతలలో ఒకరైన రాజీవ్ రెడ్డి హైదరాబాదులో ప్రింట్ అండ్ వెబ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అనుష్క క్రేజ్ గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ, సినిమా మొదలు పెట్టే సమయంలో అనుష్క క్రేజ్ గురించి మేము పెద్దగా ఆలోచించలేదు, కానీ ఎప్పుడైతే సినిమా షూటింగ్ మొదలు పెట్టామో, అప్పుడే మాకు ఈ సినిమా స్పాన్ ఏంటో అర్థం అయిపోయింది అంటూ కామెంట్ చేశారు.

ఆయన మాట్లాడుతూ, ఈ సినిమా షూటింగ్ ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లోని మారుమూల కొండ ప్రాంతాలలో చేశామని, అక్కడ తమకు ఆసక్తికరమైన అనుభవాలు ఎదురయ్యాయని చెప్పుకొచ్చాడు. ఆయన మాట్లాడుతూ, అనుష్క షూటింగ్ కోసం వచ్చి స్టే చేసిన హోటల్ బయట వెయ్యి మంది ఉదయాన్నే పోగై ఉండేవారు. సాయంత్రం సినిమా షూటింగ్ ముగించుకుని వచ్చే సమయానికి 1000 నుంచి 1500 మంది వరకు పోగయ్యి, అనుష్కను చూసేందుకు ఆసక్తి కనబరుస్తూ ఉండేవారు. ఇదంతా నేను చెప్పేది ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని ఒక రిమోట్ గ్రామం సంగతి. అక్కడే పరిస్థితి ఇలా ఉంటే, ఇంకా వేరే ప్రాంతాలలో ఆమెకున్న క్రేజ్ ఎలాంటిదో మీరు అర్థం చేసుకోవచ్చు అంటూ రాజీవ్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇక రాజీవ్ రెడ్డి స్వయంగా డైరెక్టర్ క్రిష్‌కి స్నేహితుడు. క్రిష్‌తో కలిసి ఆయన వరుస సినిమాలు చేస్తూ వస్తున్నారు. గమ్యంతో మొదలుపెట్టి ఘాటి వరకు ఆయన క్రిష్‌తోనే ప్రయాణం చేస్తున్నారు.

# కథను మైథలాజికల్ జానర్‌ను యాడ్ చేసి చెప్పడమే కొత్త





స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదల నిర్మించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించిన ఈ మూవీలో సత్య రాజ్, ఉదయభాను, వశిష్ట ఎన్ సింహా, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ వంటి వారు ప్రముఖ పాత్రలను పోషించారు. ఈ సినిమా ఆగస్ట్ 29న ఆడియెన్స్ ముందుకు రానుంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్‌లు ఇప్పటికే ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఈ మేరకు నిర్మాత విజయ్ పాల్ రెడ్డి అడిదల చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. 'త్రిబాణధారి బార్బరిక్' ప్రయాణం మొదలైంది. నేను నా వ్యాపారాలతో బిజీగా ఉండేవాడిని. ఓ సారి ఈ కథను విన్నాను. మోహన్ గారు చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. ముందుగా చిన్న బడ్జెట్‌తో మూవీని తీయాలని అనుకున్నాం. ఆ తరువాత మారుతి గారిని కలిశాను. తీస్తే సినిమా బాగా తీయండి.. లేదంటే లేదు అని ఆయన అన్నారు. దీంతో భారీ ఎత్తున ఈ మూవీని తీయాలని ఫిక్స్ అయ్యాను. 'త్రిబాణధారి బార్బరిక్' కొత్త రకమైన కథ. చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. మలయాళంలో తీసినట్టుగా చాలా సహజంగా తీశాం.

తెలుగు ఆడియెన్స్‌కు కావాల్సిన కమర్షియల్ అంశాల్ని కూడా జోడించాం. ముందుగా ఈ కథను చిన్న స్థాయిలో తీయాలని అనుకున్నా కూడా కథ డిమాండ్ మేరకు భారీగా నిర్మించాం. ఈ కథను మైథలాజికల్ జానర్‌ను యాడ్ చేసి చెప్పడమే కొత్తగా ఉంటుంది. వరంగల్, విజయవాడలో ప్రీమియర్లు వేశాం. అక్కడ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సినిమాను చూసిన వారిలో చాలా మంది కన్నీళ్లు పెట్టుకున్నారు. మూవీ అద్భుతంగా ఉందని అందరూ పొగిడారు. మాకు అదే చాలా సంతృప్తినిచ్చింది. ఆడియెన్స్ ప్రస్తుతం కొత్త కంటెంట్, డిఫరెంట్ కాన్సెప్ట్‌లనే ఆదరిస్తున్నారు. నేను ఈ ఇండస్ట్రీకి కొత్త. మాకు మారుతి గారు అండగా నిలిచారు. కథతో పాటు టెక్నికల్ పరంగానూ చాలా కొత్తగా ఉంటుంది.



# రాత్రులు అలా చేస్తుంటాను..

స్టార్ హీరోయిన్ శ్రీలీలా ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేసి సెన్సేషన్‌గా మారింది. వరుస హిట్స్‌తో తన కంటూ మంచి మార్కెట్ సంపాదించుకుని, త్వరలో బాలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇవ్వనుంది. తన తొలి హిందీ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ క్రమంలో, టాలీవుడ్, బాలీవుడ్ ప్రాజెక్ట్స్ పూర్తి చేసుకోవడంలో బిజీగా ఉన్నప్పటికీ, శ్రీలీలా సమయాన్ని వాడుకొని ఇంటర్వ్యూలకు హాజరవుతుంది. తాజాగా, సీనియర్ నటుడు జగపతి బాబు హోస్ట్‌గా ప్రారంభమైన 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్ షో లో శ్రీ లీలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన తల్లి స్వర్ణలత గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది.

జగపతి బాబు ఆమెను ప్రశ్నించారు: "ఇండస్ట్రీలో ఒక కంప్లైంట్ ఉంది. ప్రతిదానికి 'అమ్మా, అమ్మా' అని అడుగుతావా? ఏది చేయాలన్నా ముందుగా అమ్మని అడగాలనే అలవాటు ఉందా?" ఈ ప్రశ్నకు శ్రీలీలా ఇలా సమాధానం ఇస్తూ.. ' నా జీవితంలోని ప్రతి నిర్ణయం అమ్మ దగ్గరే ఉంటుంది. 6 నెలల క్రితం వరకు, మా అమ్మ లేకుండా రాత్రి నిద్రపోయే దాన్ని కాదు. రాత్రిలో తప్పనిసరిగా అమ్మ పక్కన ఉండాలి. లేకపోతే మేల్కొన్ని వణికిపోతాను. అమ్మ నన్ను పట్టుకొని నార్మల్ చేస్తుంది. షూట్స్‌కు వెళ్ళినా అమ్మ ఉండాల్సిందే. ఆమె లేకుంటే ఉండటం కష్టం. అమ్మకు చెప్పకుండా ఏ పని చేయను' అంటూ తన తల్లిపై తన ప్రేమను మరింత వివరించారు. ప్రజంట్ ఈ మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# మరో వెబ్‌సిరీస్‌లో తమన్నా.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



ఓటీటీ ప్రేక్షకులకూ చేరువైన ప్రముఖ నటి తమన్నా. ఇప్పటికే పలు వెబ్‌సిరీస్‌లతో అలరించిన ఆమె మరో సిరీస్‌లో నటించారు. అదే.. 'డు యూ వనా పార్ట్‌నర్'. ప్రముఖ ఓటీటీ 'అమెజాన్ ప్రైమ్ వీడియో' ఒరిజినల్ సిరీస్‌గా ఇది రూపొందింది. విడుదల తేదీ సోమవారం ఖరారైంది. ఆ ఓటీటీలో సెప్టెంబరు 12 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ కామెడీ డ్రామా వెబ్‌సిరీస్‌లో బాలీవుడ్ నటి డయానా పెంటీ మరో కీలకపాత్ర పోషించారు. కాలిన్, అర్చిత్‌కుమార్ సంయుక్త దర్శకత్వంలో ఈ సిరీస్ రూపొందింది. ఇద్దరు యువతుల స్నేహం, వారు ఎదుర్కొన్న సవాళ్లు తదితర అంశాలను ఈ సిరీస్‌లో చూపించనున్నారు. 'ఓదెల 2'తో ఇటీవల ప్రేక్షకులను పలకరించారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆమెకు వరుస అవకాశాలొస్తున్నాయి. షాహిద్ కపూర్ హీరోగా తెరకెక్కనున్న 'రోమియో'లో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్టు సమాచారం. 'రాగిణి ఎమ్ఎమ్ఎస్' ఫ్రాంచైజీలో తెరకెక్కనున్న మూడో సినిమాలో తమన్నా హీరోయిన్‌గా ఎంపికయ్యారని తెలిసింది. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999